# కృష్ణా, గోదావరి జలాల వాటా తేల్చరా?

- వనరుల వినియోగంలో అంబేద్కర్ దార్శనికత ఏది?
- పార్టీ ఫిరాయింపులపై చర్యలెందుకు తీసుకోరు?
- కోర్టులకు ఆశ్రయించే పరిస్థితి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సరైంది కాదు
- రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు పూర్తయినా గోదావరి, కృష్ణా నదీజలాల వాటా తేల్చకుండా నాన్చుడు ధోరణిని అవలంబించడం ఏమిటని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నీటి వనరుల వినియోగం, కేటాయింపుల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చూపిన దార్శనికతను కేంద్రం విస్మరించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. దేశంలో సహజ వనరుల వినియోగం ప్రత్యేకించి నదీ జలాలు, విద్యుత్ వినియోగం విషయంలో దశాబ్దాలుగా రాష్ట్రాల మధ్య, రాష్ట్రాల్లోని ప్రాంతాల మధ్య తీవ్ర వ్యత్యాసాలున్నాయని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 1.40 లక్షల టీఎంసీల వర్షం కురిస్తే అందులో సగం ఆవిరైపోతుందని, మిగిలినదాంట్లో



50 వేల టీఎంసీలు సముద్రం పాలవుతున్నాయని, మిగిలిన 20 వేల టీఎంసీలను మాత్రమే వినియోగిస్తున్నామని ఆయన వివరించారు. నదీజలాల పంపిణీ, వివాదాలను పరిష్కరించటంలో ట్రిబ్యునళ్లు సకాలంలో స్పందించటం లేదని మండిపడ్డారు. నీటి పంపిణీ విషయంలో రాష్ట్రాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి ట్రిబ్యునళ్లు తెలంగాణ, ఏపీ మధ్య ఉన్న వివాదాలను పరిష్కరించకపోగా కొత్త అనుమానాలకు తావిచ్చే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్ వినియోగంలోనూ ప్రభుత్వాలు మేల్కొవాల్సిన అవసరం ఉందని సూచించారు.

### కరువు నేలపై సిరులు కురిపించిన కేసీఆర్

అందుబాటులో ఉన్న నదీ జలాల వినియోగంలో దేశానికి తెలంగాణను రోల్‌మాడల్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిలిపారని కేఆర్ సురేశ్‌రెడ్డి కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించి ఒకప్పుడు కరువుగా కేరాఫ్‌గా ఉన్న తెలంగాణను సిరుల నేలగా మార్చారని తెలిపారు.

### పార్టీ ఫిరాయింపులపై కోర్టులకా?

పార్టీ ఫిరాయింపులపై కోర్టులను ఆశ్రయించే పరిస్థితి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కేఆర్ సురేశ్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకొంటూనే పార్లమెంట్ చేసిన చట్టాలను నిర్వీర్యం చేసే పరిస్థితులు రావడం వ్యవస్థ దయనీయస్థితికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దురవస్థ ఎందుకొచ్చిందో ఆలోచించుకోవాలని హితవు పలికారు. ఈ విషయమై పార్లమెంట్ కమిటీ వేయాలని, ఆ కమిటీ సూచనల మేరకు చట్టసవరణ చేసి, ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## సమగ్ర సర్వే అశాస్త్రీయం

**బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శేషు**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రిపోర్టు అశాస్త్రీయంగా ఉందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు విమర్శించారు. హనుమకొండలోని కేయూ దూరవిద్యా కేంద్రంలోని పూలే విగ్రహాల వద్ద మంగళవారం సర్వే రిపోర్టుపై నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ కులగణన నివేదికలో బీసీలను 46 శాతంగా తక్కువ చేసి చూపించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. 2014లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీ జనాభా 46 శాతానికి ఎలా తగ్గిపోయిందని ప్రశ్నించారు.

## కులగణన అర్థమే మార్చింది

**బీసీ రైటర్స్ వింగ్ స్టేట్ చైర్మన్ డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్**

ఖిలావరంగల్, ఫిబ్రవరి 4: ఈడబ్ల్యూఎస్ కోటా కోసమే బీసీ జనాభాను తగ్గించిన కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కు ల జన గణన అర్థాన్నే మార్చేసిందని బీసీ రైటర్స్ వింగ్ స్టేట్ చైర్మన్ డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. 2011లో 60 శాతం ఉన్న బీసీ జనాభాను ఇరవై లక్షలు తగ్గించి 56.33 శాతంగా చూపించడం విచారకరమన్నారు. ఏడు శాతం ఉన్న ఓసీ జనాభాకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ పన్నిన అతిపెద్ద కుట్ర అని మండిపడ్డారు. 20 లక్షల బీసీ జనాభా ఎటు పోయిందో కాంగ్రెస్ పెద్దలే చెప్పాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ బీసీలకు ప్రకటించిన 42 స్థానిక సంస్థల కోటా అనేది 60 శాతమున్న బీసీలకు చెందుతుందని చెప్పారు.

# పరిషత్ తర్వాతే పంచాయతీ ఎన్నికలు!

- పార్టీల గుర్తుల ఆధారంగా 42% బీసీ కోటా?
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన
- కసరత్తు చేస్తున్న ఎలక్షన్ కమిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తేతెలంగాణ): బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధ్యం కాదని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. పార్టీ రహితంగా జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుచేయడం ఇప్పటికిప్పుడు వీలుకాదన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ఈ పరిస్థితుల్లో ముందుగా పార్టీల గుర్తుల ఆధారంగా జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించనున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే అటు ఎలక్షన్ కమిషన్, ఇటు యంత్రాంగానికి మౌఖికంగా సూచనలు ఇచ్చినట్టు అధి



కార పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుతున్నది. అంతా అనుకున్నట్టు జరిగితే పరిషత్ ఎన్నికల ప్రక్రియను ఈ నెలాఖరులోనే పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

### పార్టీ పరంగానే బీసీ కోటా

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుచేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇందుకోసం నిరుడు సెప్టెంబర్‌లో బీసీ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌కు చట్టబద్ధత లేదని బీసీ సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తంకావడంతో నవంబర్‌లో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృతంలో క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించి, ఆ వెంటనే కులగణన సర్వే నిర్వహణకు ఉపక్రమించింది. మూడు రోజుల క్రితం ప్రభుత్వానికి సర్వే నివేదిక అందింది. ఈ సర్వేపై ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేసింది. దీనిపై చర్చించిన తరువాత బీసీలకు 42% కోటా ఇవ్వాలని ప్రతిపాదిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. చట్టసవరణ చేయాలని కోరింది. అంటే ఇప్పటికిప్పుడు బీసీ రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని తేలడంతో కాంగ్రెస్ తరుపున బీసీలకు 42% సీట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

### 15 తర్వాత ఎన్నికల షెడ్యూల్?

చట్టప్రకారం బీసీ రిజర్వేషన్లు కేటాయించే అవకాశం ఇప్పటికిప్పుడు లేకపోవడంతో సాధ్యమైనంత తొందరగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ పరిస్థితుల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని సంకల్పిస్తున్నది. ఈ నెల 15 తర్వాత షెడ్యూల్ విడుదల చేసి రెండు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చినట్టు ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం అందించినట్టు సమాచారం. ఎంపీటీసీ స్థానాల పునర్వ్యవస్థీకరణను కూడా పూర్తిచేయాలని నిర్దేశించినట్టు తెలిసింది.

### ఫలితాల ఆధారంగానే పంచాయతీ..

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల ఫలితాలు వస్తే ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతికూల ఫలితాలు వస్తే మాత్రం వెనుకడుగు వేసే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎమ్మెల్సీ నవీన్‌పై క్రమశిక్షణ చర్యలు?

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) పై క్రమశిక్షణా చర్యలకు టీపీసీసీ రంగం సిద్ధం చేస్తున్నది. అందులో భాగంగానే ఆయనకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విషయమై టీపీసీసీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కాంగ్రెస్ నేతలే లీకులు వదిలినట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణనపై మల్లన్న పార్టీ విధానాలకు విరుద్ధంగా మాట్లాడినట్టు పలువురు కాంగ్రెస్ నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు



చేసినట్టు తెలిసింది. కులగణన నివేదికను ఇటీవల మల్లన్న తప్పులతడకగా అభివర్ణించడంతోపాటు సర్వే నివేదికను తగలబెట్టమని మల్లన్న చేసిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

### మల్లన్న విజ్ఞతకే వదిలేస్తున్నా: కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఒక కులం పేరుతో సమావేశం నిర్వహించి, ఇతర కులాలను తిట్టడం వల్ల ప్రజల మధ్య మనస్పర్థలు వస్తాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బీఫాంపై గెలిచిన తీన్మార్ మల్లన్న తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఆ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. మల్లన్న తనను తిడితే స్వాగతిస్తానని, అయితే కులాన్ని తిట్టడం సరైనది కాదని పేర్కొన్నారు.

### బయటికెళ్లి మాట్లాడాలె : ఎమ్మెల్యే నాయిని

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఇష్టం లేకుంటే పార్టీ నుంచి బయటికెళ్లి మాట్లాడుకోవచ్చునని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. మల్లన్నకు ఇతర కులాలపై మాట్లాడే హక్కులేదని పేర్కొన్నారు.

### మల్లన్నపై డీజీపీకి ఫిర్యాదులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెడ్డి సంఘం, అగ్రవర్ణ పేదల సమితి ప్రతినిధులు మంగళవారం డీజీపీ జితేందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. వరంగల్‌లో జరిగిన బీసీ సభలో తీన్మార్ మల్లన్న తీవ్ర పదజాలంతో రెడ్డి కులాన్ని దూషించడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

### అవగాహనా రాహిత్యమే..

పరకాల, ఫిబ్రవరి 4: రాజ్యాంగబద్ధంగా అగ్రవర్ణ పేదలకు కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయడం అవగాహనా రాహిత్యమని ఓసీ సంఘాల జేఏసీ నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, మాడుగుల పాపిరెడ్డి విమర్శించారు. ఇటీవల తీన్మార్ మల్లన్న ఓ సభలో చేసిన వ్యాఖ్యలపై ఓసీ సంఘాల నాయకులు మంగళవారం హనుమకొండ జిల్లా పరకాలలోని అమరధామంలో నిరసన వ్యక్తంచేశారు.



నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## మాజీ సర్పంచ్‌ల 'చలో అసెంబ్లీ' భగ్నం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 4: పెండింగ్ బిల్లుల విడుదల కోసం మాజీ సర్పంచ్‌లు మంగళవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి జిల్లాల్లో ఎక్కడికక్కడ నిర్బంధంలోకి తీసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మాజీ సర్పంచులు చలో అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. మోర్తాడ్, ధర్పల్లి, సిరికొండ, ఆర్మూర్, బోధన్ తదితర మండలాల్లో తాజా మజీ సర్పంచులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నల్లగొండ, మిర్యాలగూడ, కనగల్, త్రిపురారం, కొండమల్లేపల్లి, నిడమనూరు, కట్టంగూరు, వేములపల్లి, మునుగోడు, చండూరు, నకిరేకల్, గుర్రంపోడు, చిట్యాల, గరిడేపల్లి, తుంగతుర్తితోపాటు మరికొన్ని మండలాల్లో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి సాయంత్రం వరకు స్టేషన్లలో నిర్బంధించారు. ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

### బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను అడ్డుకుంటారనే అనుమానంతో ఆయా జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

## బీసీల సత్తా చూపిస్తాం

- సూర్యాపేటలో జానారెడ్డి దిష్టిబొమ్మ దహనం

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో బీసీ జనాభాను తక్కువగా చూపించడం వెనుక ప్రముఖ పాత్ర పోషించిన మాజీ మంత్రి జానారెడ్డికి బీసీల సత్తా చూపిస్తామని సూర్యాపేట జిల్లా బీసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. సూర్యాపేటలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో మంగళవారం జానారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీల జనాభా పెరిగితే కాంగ్రెస్ సర్కారు సర్వేలో 21 లక్షలు ఎలా తగ్గిందని ప్రశ్నించారు. 7 శాతం ఉన్న ఓసీలు 15 శాతం ఎలా అయ్యారని నిలదీశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రెడ్డీలతో కలిసి జానారెడ్డి బీసీ జనాభాను తగ్గించారని ఆరోపించారు. కులగణన మళ్లీ నిర్వహించాలని తెలిపారు.

## గూడు చిదిమిన బుల్డోజర్

మొదటిపేజీ తరువాయి...

నేలమట్టం చేస్తున్నాయి. కూల్చివేతలకు అడ్డం వస్తున్న బాధితులు మహిళలు, చిన్నారులను పోలీసులు నిర్దాక్షిణ్యంగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నిర్బంధపు ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది.

### కోదాడ-జడ్చర్ల ఎన్‌హెచ్ నిర్మాణం

చారకొండ మండల కేంద్రంలో జాతీయ రహదారికి బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. బైపాస్ నిర్మాణాన్ని చారకొండ గ్రామస్తులు ఆదినుంచీ వ్యతిరేకిస్తున్నారు. చారకొండ రోడ్డునే వెడల్పు చేసి జాతీయ రహదారి నిర్మించాలని అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. చివరకు ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి.

### బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రదేశం వరకు..


బైపాస్ రోడ్డు నిర్మాణం చారకొండ-మర్రిపల్లి గ్రామాల మధ్య 2 కిలోమీటర్ల మేర ఉంటుంది. బైపాస్ నిర్మాణం చేపడితే 29 ఇండ్లు, పాఠశాల ప్రహరీ, వందల సంఖ్యలో ఇండ్ల స్థలాలు రోడ్డులో పోతాయి. బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడితే తాము రోడ్డున పడుతామని బాధితులు అధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే దీనిపై నిర్ణయం తీసుకోవాలనుకుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పరిస్థితి మారిపోయింది. మంగళవారం ఉదయం తమ ఇండ్లకు జేసీబీలు.. బుల్డోజర్లు వచ్చే వరకు పరిస్థితి అర్థంకాలేదు. వందల సంఖ్యలో పోలీసులు వచ్చి ఇళ్లు కూల్చేస్తున్నారు.. ఇంటి నుంచి బయటకు వచ్చేయండి.. అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆందోళనకు గురైన బాధితులు ఇక్కసారిగా బయటకు వచ్చి కూల్చివేతలను అడ్డుకునే యత్నంచేయగా పోలీసులు ఈడ్చి పక్కకు పడేశారు. ఒక పక్క కూల్చివేతలు, మరో పక్క బాధితుల రోదనల మధ్య ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. గిరిజ అనే మహిళ రోదిస్తూ ఇల్లు లేకుంటే తమకు చావే గతి అంటూ ఇద్దరి పిల్లలతో ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఇళ్లతోపాటే తమనూ సమాధి చేయాలంటూ రోదించింది. అయినా కనికరించని ఖాకీలు ఇంటి తలుపులు పగులగొట్టి గిరిజన, పిల్లలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### సామగ్రిని తరలించిన పోలీసులు

ఐదారు బాధిత కుటుంబాలు సామాన్లు సర్దుకొని భద్రపరుచుకుంటే.. మిగతా బాధితుల సామగ్రిని పోలీసులే సర్ది వ్యవసాయశాఖ గోదాం, రైతు వేదికకు తరలించారు. ఇండ్లు కూల్చిన 29 మంది బాధితుల్లో ఐదారు కుటుంబాలు మాత్రమే ప్రత్యామ్నాయం చూసుకున్నారు. మిగతా వారందరూ రోడ్డుపైనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం ఒక రోజు ముందు సమాచారం ఇవ్వకుండా ఇండ్లు కూల్చడమేమిటని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు.

## స్పీకర్ మీనమేషాలు లెక్కించడం తగదు

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాములు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మీనమేషాలు లెక్కించడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడంపై స్పందించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారడం వారిని గెలిపించిన ఓటర్లను అవమానించడమేనని పేర్కొన్నారు. ఏ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యే ఆ పార్టీలోనే ఉండాలని, పార్టీలు ఫిరాయించటం సరికాదని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని, రైల్వేబడ్జెట్‌లోనూ తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రకటనలు.. ప్రగల్భాలు

- అసెంబ్లీలో కులగణనపై రేవంత్ సర్కారు తీరు
- సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు కరువు
- హడావుడిగా సభలో పెట్టడంపై మంత్రుల అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం ప్రవేశపెట్టిన కులగణన సర్వే నివేదికపై ప్రకటనలు, ప్రగల్భాలకే సర్కారు పరిమితమైంది. నివేదికలోని అంశాలను రెండురోజుల క్రితమే మంత్రుల సబ్‌కమిటీ వెల్లడించింది. ఇదే నివేదికను మంగళవారం నిర్వహించిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టారు. సర్వే నివేదికను ప్లానింగ్‌శాఖ ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘానికి అందజేసింది. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను మంత్రి ఉత్తమ్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం జనాభా 3.7 కోట్లు కాగా, వారిలో 16 లక్షల మంది (3.1%) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలను సేకరించినట్టు నివేదించారు. అందులో బీసీలు 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఓసీలు 15.79%, ఎస్టీలు 10.45% ఉన్నట్టు తెలిపారు. తాజాగా అసెంబ్లీలో ప్రభుత్వం కూడా ఇవే అంశాలను చెప్పింది తప్ప కొత్తగా ఒక్క అంశాన్నీ చేర్చలేదు. తొలగించలేదు. అదనపు గణాంకాలను నివేదించలేదు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వే చేపట్టామని గొప్పగా చెప్పుకున్నారు. అయితే బీఆర్ఎస్‌తోపాటు ఇతర విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నివేదికను తప్పుల తడకగా రూపొందించారని, ఉద్దేశపూర్వకంగానే బీసీ వర్గాల జనాభాను తగ్గించారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. కానీ ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి స్పందన కరువైంది. ఒకానొక దశలో మంత్రులు ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థంకాలేదు. నివేదికను హడావుడిగా సభలో పెట్టడంపై పలువురు మంత్రులు, అధికార పార్టీ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. పూర్తిస్థాయిలో అధ్యయనం చేయకుండా సభ ముందుకు తేవడంతో అభాసుపాలయ్యామని ఒకింత అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ సర్వేలోని అనేక లోపాలను సవరించకుండానే అసెంబ్లీలో పెట్టడంతో బీసీ సంఘాలతోపాటు ప్రతిపక్షాల విమర్శలకు అవకాశం ఇచ్చినట్టయిందని లోలోన రగిలిపోయినట్టు వినికిడి.

### ముఖ్యమంత్రి రేవంత్ బీసీల ద్రోహి: ఉపేందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కోటాను ఎగ్గొట్టి బీసీలకు తీరని ద్రోహం చేశారని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేందర్ ధ్వజమెత్తారు. తప్పుల తడకగా కులగణన నివేదిక రూపొందించారని ఆరోపించారు. 42% కోటా కోసం చట్టం చేస్తామని చెప్పి తీరా పంచాయతీ ఎన్నికల ముందర ఉసూరుమనిపించారని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అగ్రవర్ణాల ప్రయోజనాల కోసం బీసీల జనాభాను తగ్గించి చూపడం దుర్మార్గమని పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్‌లపై సర్కారు దమనకాండ

హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లపై సర్కారు దమనకాండకు దిగుతున్నది. హైదరాబాద్‌కు వెళ్తున్నారనే సమాచారంతో రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో మంగళవారం రాత్రే మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్పంచ్‌ల జేఏసీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. ప్రభుత్వ వైఖరిపై జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బిల్లులు ఇవ్వకుండా గోసపెడుతున్న సర్కారు నిరసనకు కూడా అవకాశం ఇవ్వకపోడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

మొదటిపేజీ తరువాయి...

కోసం రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైన రోజునే ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ నోటీసులతో ఎమ్మెల్యేలు పయనం ఎటు? వారి రాజకీయ భవిష్యత్తు ఏమిటి ?అన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది. నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ అసెంబ్లీ లాబీలో స్పందించారు. తనకు ఎలాంటి నోటీసులు రాలేదని, వచ్చాక స్పందిస్తానని దానం నాగేందర్ పేర్కొనగా, తనకు నోటీసులు అందాయని కడియం శ్రీహరి చెప్పారు.

### సమయం ఇవ్వని సీఎం...

సుప్రీంకోర్టు ఆదేశాలు, శాసనసభ కార్యదర్శి నుంచి నోటీసులు వచ్చిన నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్‌తోపాటు పది మంది ఎమ్మెల్యేలు మంగళవారం శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించారు. అయితే, మంత్రివర్గ సమావేశం, ఆ తర్వాత వరుసగా బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలపై సీఎం స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉండటంతో ఆయన కుదరదని చెప్పినట్టు తెల్సింది. దీంతో ప్రభుత్వ ముఖ్యసలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. సుప్రీంకోర్టులో కేసు విచారణకు వస్తున్నదని, తమ భవిష్యత్తు ఏమిటని వారు ప్రశ్నించినట్టు తెల్సింది. సుప్రీంకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలను బట్టి త్వరలోనే ఏదో ఒక నిర్ణయం తీసుకునేలా కనిపిస్తున్నదని, ఒకవేళ అలాంటి నిర్ణయం తీసుకొని తాము అనర్హులమైతే ఏం చేయాలని వారు అడిగినట్టు సమాచారం. దీనికి వేం నరేందర్‌రెడ్డి స్పందిస్తూ.. మంచి న్యాయవాదిని పెడ్తామని, ప్రభుత్వం తరపున ఇప్పటికే దేశంలోని అత్యంత పేరున్న న్యాయవాదులను ఎంగేజ్ చేశామని చెప్పినట్టు తెల్సింది. కొంతకాలం సాగదీద్దామని, పరిస్థితులు అనుకూలంగా మారుతాయని భరోసా ఇచ్చే ప్రయత్నం చేసినట్టు సమాచారం. ఒకవేళ తమపై అనర్హత వేటు పడితే ఉప ఎన్నికల్లో గెలువడం ఇబ్బందవుతుందని, తమ నియోజకవర్గాలకు హామీ ఇచ్చిన మేరకు నిధులను మంజూరు చేయాలని, వాటిని త్వరగా ప్రారంభించుకుంటామని వారు చెప్పినట్టు తెలిసింది. తమకు పార్టీ తరపున ఇచ్చిన హామీ మేరకు పదవులు, పనుల విషయంలో చొరవ తీసుకోవాలని కూడా వారు కోరినట్టు సమాచారం.

### ఏడాదిన్నర సాగదీస్తాం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అసెంబ్లీ లాబీలో కడియం శ్రీహరి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. తనకు ఇచ్చిన నోటీసుకు కాలపరిమితి ఏదీలేదని చెప్పారు. 'మెల్లగా రిప్లై ఇస్తాం. తొందరేముంది?' అని అన్నారు. సంవత్సరంపాటు సాగదీస్తామని, ప్రభుత్వం సుప్రీంకోర్టులో గట్టిగా కొట్లాడేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఈలోగా నియోజకవర్గంలో చేయాల్సినంత అభివృద్ధి పనులు చేసుకుంటామని పేర్కొన్నారు. అప్పటికి ఏదైనా స్పష్టత వచ్చాక, రిజైన్ చేయాల్సి వస్తే ఏడాదిన్నరకో..రెండేండ్లకో చేస్తామని వెల్లడించారు.

## రాహుల్‌గాంధీ చెప్పింది ఇదేనా?

- బ్యూరోక్రటిక్ సర్వేతో ప్రయోజనం లేదన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్
- ఆయన మాటలకు విరుద్ధంగా రాష్ట్ర కాంగ్రెస్ నేతల వ్యవహారశైలి
- సర్వేతోపాటు నివేదికా వెల్లడి
- పైగా దేశానికే దిక్సూచని ప్రగల్భాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ లోక్‌సభా పక్షనేత రాహుల్‌గాంధీ మాట మేరకు దేశానికే దిక్సూచిలా తెలంగాణ నిలిచేలా సర్వే నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు పదే పదే మాటల కోటలు కట్టారు. కులగణన చేపట్టింది మొదలు, సర్వే లెక్కలను అసెంబ్లీకి నివేదించే వరకూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ప్రగల్భాలు పలికారు. కానీ, ఆచరణలో రాహుల్‌గాంధీ ప్రవచనాలకు పాతరేశారు. పూర్తిభిన్నంగా బ్యూరోక్రటిక్ కులగణనను కాంగ్రెస్ సర్కారు నిర్వహించింది. శాస్త్రీయత పాటించకుండా కంటితుడుపుగా సర్వే చేపట్టి, కాకిలెక్కలను చెప్పి మమ అనిపించారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. యావత్ తెలంగాణ సమాజం కాంగ్రెస్ సర్కారు వ్యవహారశైలిపై దుమ్మెత్తిపోస్తున్నది.

### ప్రజాభిప్రాయాలకు విలువేది?

ఇంటింటి సర్వేకు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ప్రశ్నావళిపై ఆదిలోనే అనేక వర్గాలు, కుల సంఘాలు, కార్మిక సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్ చేసింది. వారిని కులంగా కాకుండా వృత్తులుగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సంప్రదాయ వృత్తులైన కమ్మరం, వడ్రంగం, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తులు చేస్తున్న వారందరినీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులుగానే గుర్తించాల్సి ఉన్నా, సర్వే ప్రశ్నావళిలో పంచవృత్తులకు బదులుగా సంప్రదాయ వృత్తుల జాబితాలో కమ్మరం, వడ్రంగి, స్వర్ణకార వృత్తులనే కులాలుగా ముద్రించడాన్ని ఆక్షేపించింది. ఇత్తడి, శిల్పి వృత్తులను విస్మరించింది. దానిని సవరించాలని ఆ సంఘం డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. అదే విధంగా తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూయూ) కూడా పలు సూచనలు ముందుపెట్టింది. 'రోజువారీ వేతన కార్మికులు' అనే కోడ్ శీర్షికను 'అసంఘటిత విభాగం కార్మికులు/ వేతన కార్మికులు'గా మార్చాలని తెలిపింది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను వేర్వేరుగా స్వయం ఉపాధి కింద కోడ్‌లుగా వర్గీకరిస్తున్నారని, అలా కాకుండా కోడ్-4లోనే వర్గీకరించాలని డిమాండ్ చేసింది. మరికొన్ని శీర్షికల్లోనూ మార్పులు చేయాలని ప్రతిపాదించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాలు సైతం ఆమోదయోగ్యమైన, అర్థవంతమైన, సహేతుకమైన అనేక సూచనలను ప్రభుత్వం ముందుపెట్టాయి. అయినప్పటికీ ఇటు ప్రభుత్వం, అటు ప్లానింగ్ బోర్డు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా అసంబద్ధమైన గణాంకాలు, అసమగ్ర సమాచారంతో నివేదికను కూడా వెల్లడించింది. ఇదేనా రాహుల్‌గాంధీ చెప్పిన ప్రజా కులగణన అని కాంగ్రెస్ తీరుపై మేధావులు, సామాజికవేత్తలు నిప్పులు చెరుగుతున్నారు. ఈ నివేదిక కచ్చితత్వం, ప్రామాణికతను కోల్పోయిందని, మొత్తంగా సర్వే ఉద్దేశం నెరవేరడమే ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాహుల్ మాటకు విరుద్ధంగా రేవంత్ బాట

కులగణన అంశంపై ప్రజాసంఘాలు, కుల సంఘాలు, సామాజికవేత్తల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ హడావుడిగా మహారాష్ట్ర ఎన్నికలకు ముందు తెలంగాణకు విచ్చేశారు. మేధావివర్గం, ప్రజాసంఘాలు, కులసంఘాల నేతలతో భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు. కులగణన ఏ రీతిలో ఉండాలి? ఏ విధానాలను అవలంబించాలి? ఏ పద్ధతిలో సర్వే నిర్వహించాలి? తదితర అంశాలను స్పష్టంగా నొక్కిచెప్పారు. అధికార యంత్రాంగం తీర్చిదిద్దిన ప్రశ్నావళితో, రూపొందించిన నియమనిబంధనలతో కుల సర్వేను నిర్వహించవద్దని స్పష్టంగా చెప్పారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలను రూపొందించి, అవసరమైతే వారి నుంచే ప్రశ్నలను స్వీకరించి ప్రశ్నావళిని తయారు చేసి ప్రజా కులగణన నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ సర్కారు మాత్రం అందుకు విరుద్ధంగా సర్వే నిర్వహించింది. బ్యూరోక్రటిక్‌గానే సర్వేను కొనసాగించిందే తప్ప ఎక్కడా ప్రజాభిప్రాయాలు, కులసంఘాల సూచనలు పాటించలేదు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ప్రశ్నావళితోనే సర్వే పూర్తిచేయడమే కాదు, నివేదికను కూడా వెల్లడించిం ది. అయినా రాహుల్ మాట మేరకే చేశామంటూ కాంగ్రెస్ ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతుండటంపై విమర్శలొస్తున్నాయి.